# ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో?

- అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్
- తరుచు ప్రమాదాలు బారిన స్థానికులు
- పట్టించుకోని అధికారులు

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీలో స్థానికులకు ట్రాఫిక్ కష్టాలు ఇప్పుట్లో తీరేలా లేవు. మున్సిపాలిటీలో పరిశ్రమల సంఖ్య అధికంగా ఉండటంతో జనాభా సంఖ్య పెరుగుతోంది. అలాగే, శ్రీశైలం జాతీయ రహదారిపై నిత్యం వాహనాలు రద్దీ ఉంటుంది. ట్రాఫిక్ పెరగడంతో ప్రమాదాల జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై వేగనియంత్రణ, సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు దాటాలంటే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు వాహనదారులు రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు మరింత ఎక్కువవుతోంది.

**రద్దీగా రోడ్లు..**

శ్రీశైలం జాతీయ రహదారిపై ట్రాఫిక్ రోజురోజుకూ పెరుగుతోంది. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. శ్రీశైలం జాతీయ రహదారి అయినప్పటికీ ఎక్కడా కూడా సిగ్నల్స్ లేవు. శ్రీశైలం జాతీయ రహదారి కావడంతో నిత్యం శ్రీశైలం మల్లన్న దైవ దర్శనం కోసం, శంషాబాద్ ఇంటర్‌నేషనల్ ఎయిర్ పోర్టు, వండర్‌లా వినోద కేంద్రం, ఫ్యాబ్‌సిటీ, హార్డ్ వేర్ పార్కు, మంఖాల్ పారిశ్రామికవాడ ఇలా అనేక రకాల కేంద్రాలు ఉండటంతో ఈ రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ట్రాఫిక్ సమస్య కూడా అధికంగా ఉంటుంది.



తుక్కుగూడలో రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

**నడిరోడ్డు పైనా పార్కింగ్..**

శ్రీశైలం జాతీయ రహదారి ఒకవైపు 25 ఫీట్ల విస్తరణ కలిగి ఉంది. తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో రెండు కిలో మీటర్ల దూరం మేరకు వ్యాపార వాణిజ్య సంస్థలు ఉన్నాయి. దీంతో వివిధ పనులు నిమిత్తం వచ్చే వారు తమ వాహనాలను నడిరోడ్డులో పార్క్ చేస్తున్నారు. 25 ఫీట్ల రోడ్డు 10 ఫీట్ల మేరకు ప్రయాణికులు వాహనాలను నిలవడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతుంది. హోటల్స్, వైన్‌షాపుల ముందు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

**నిత్యం ప్రమాదాలే**

- గత రెండేళ్ల కిందట సిండికేట్ బ్యాంక్ వద్ద జరిగిన ప్రమాదంలో తుక్కుగూడకు ఇద్దరు భార్యాభర్తలు మృతి చెందారు.
- గత ఏడాది అక్టోబర్ 28న తుక్కుగూడకు చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు.
- గత నెలలో తుక్కుగూడలో వాహనాలు రద్దీగా ఉండటంతో ఓ కారు అదుపు తప్పి షాపులోకి దూసుకెళ్లింది.
- నిత్యం ఈ రోడ్డుపై ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి.

**నింబంధనలు పాటించాలి**

శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో మేము వ్యాపార సంస్థల నిర్వాహకులకు రోడ్లపై పార్కింగ్ చేయొద్దని తెలియజేశాం. త్వరలో వారికి మా శాఖ నుంచి నోటీసులు జారీ చేస్తాం. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నింబంధనలు పాటించాలి

– వెంకటయ్య ట్రాఫిక్ ఎస్ఐ ఇబ్రహీంపట్నం

# సామూహిక కుంకుమార్చన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ కాలనీలోని పార్కులో శనివారం గణపతి నవరాత్రులను పురస్కరించుకుని రెండు వందల మంది మహిళలు గణనాథుని వద్ద సామూహిక కుంకుమర్చనలు, వ్రతాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ బోయపల్లి దీపిక, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.శేఖర్‌రెడ్డి హాజరై గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రావు, మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు అమరేందర్‌రెడ్డి, శివకుమార్, రాజిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కమలాకర్‌రావు, వెంకటయ్య, సాయిరెడ్డి, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.



సామూహిక వత్రాలు చేస్తున్న మహిళలు

# సమస్యలు పరిష్కరించాలని వినతి

కందుకూరు: అంగన్‌వాడీల తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం మంత్రి సబితారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన మంత్రి సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా తన వంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు, జిల్లా కార్యదర్శి ఎ.చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు రవికుమార్, సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు రాధిక, షాజహాన్, సుమతి, శైలజ, చంద్రకళ, పుష్ప పాల్గొన్నారు.

# సీసీరోడ్డు పనులు ప్రారంభం

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని కాలనీల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని మీర్‌పేట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ పేర్కొన్నారు. 9వ డివిజన్ నందిహిల్స్, టీచర్స్‌కాలనీ, విజ్ఞానపురికాలనీల్లో రూ.42 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ పెండ్యాల శివపార్వతితో కలిసి శనివారం మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, కమిషనర్ అల్లూరి వాణి, కార్పొరేటర్లు నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, భీంరాజ్, కాలనీవాసులు విజయ్‌కుమార్, హన్మంతరెడ్డి, విక్కీసాగర్, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న మేయర్ దుర్గ, శివపార్వతి తదితరులు

# బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి

**ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి**

హస్తినాపురం: పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, వాటిని పకడ్బందీగా అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని ఈదులకంటి రాంరెడ్డిగార్డెన్స్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి ఆధ్వర్యంలో 200 మంది ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రధాన లక్ష్యమైన తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు సాధించుకున్న తెలంగాణలో అన్ని రంగాలలో గొప్ప విజయాలను నమోదు చేసిందన్నారు. గడిచిన 9 ఏళ్లలో రాష్ట్ర తాగునీరు, సాగునీరు, సంక్షేమం, విద్యుత్, వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాల్లో గొప్ప ప్రగతి సాధించిందన్నారు. బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నాయకులు హరీష్‌రెడ్డి, రోహిత్, సురేష్‌యాదవ్, మహేశ్, శ్రీహరి, శరత్, వేణు, ప్రశాంత్, శ్రీనిధి చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గజ్జెల మదుసూధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం ధర్మకర్త నారగోని శ్రీనివాస్‌యాదవ్, ఉదయ్‌రెడ్డి, డేరింగుల కృష్ణ, కంచర్ల శివారెడ్డి, నల్ల నాగిరెడ్డి, సాయి, విజయ్, మహేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

# పేదల విద్య, వైద్యం, ఉపాధే లక్ష్యం

**కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి**

కడ్తాల్: నియోజకవర్గ ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి కల్పనే లక్ష్యంగా సహకారం అందిస్తానని కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ తండాలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయ నిర్మాణ పనులకు రూ.1 లక్ష చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు, ఆలయాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరుణాకర్‌గౌడ్, వార్డు సభ్యులు సరితారమేశ్, వెంకటేశ్, మల్లేశ్‌నాయక్, చిరంజీవి, వినోద్, గోపి ఉన్నారు.

**ఆలయ అభివృద్ధికి సహకారం**

ఆమనగల్లు: ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లిలో హనుమాన్ ఆలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని చెప్పారు. పురాతన ఆలయాల అభివృద్ధికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వరప్రసాద్‌రెడ్డి, శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, ఆలయ నిర్వాహకులు లక్ష్మణస్వామి తదితరులు ఉన్నారు.

# కవయిత్రి మొల్లమాంబ విగ్రహావిష్కరణ

కందుకూరు: మండల కేంద్రంలో కుమ్మరి(శాలివాహన)సంఘం మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని శనివారం మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామాయణాన్ని అందరికీ అర్థమయ్యేలా తెలుగులోకి అనువదించిందని వారు కొనియాడారు. కుమ్మరుల ఆడపడుచు అయిన మొల్లమాంబ చరిత్రను అందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి సంఘం రాష్ట్ర నాయకులు దయానంద, వీరన్న, నియోజకవర్గం అధ్యక్షుడు బాలయ్య, ఎంపీపీ మంద జ్యోతి పాండు, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్‌రెడ్డి, కుమ్మరి సంఘం మండల యూత్ అధ్యక్షుడు ఎగిరిశెట్టి నరేష్, నాయకులు గణేష్, బాలరాజ్, ఎగిరిశెట్టి రాజు, కుమ్మరి మధు ,ఆలూరి జంగయ్య, సురేష్, రమేష్, రాజు, సాంబయ్య, లింగమయ్య, అంజయ్య, ఈశ్వర్ పాల్గొన్నారు.

**కుమ్మర కులంలో జన్మించడం అదృష్టం**

మహేశ్వరం: తెలుగు జాతి విలువైన రత్నం మొల్ల అని రాష్ట్ర కుమ్మర సంఘం ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి ఆనంద్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ పక్కన మండల కుమ్మర సంఘం ఆధ్వర్యంలో మహా కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాల్మీకి మహర్షి సంస్కృతంతో రచించిన రామాయణాన్ని సామాన్యులకు అర్థమయ్యేలా తెలుగులో రచించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ అని పేర్కొన్నారు. మొల్లమాంబ కుమ్మర కులంలో జన్మించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. కుమ్మరులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మర సంఘం ప్రచార కార్యదర్శి వీరయ్య, సిరిగిరిపురం గ్రామ సర్పంచ్ సురేష్, కుమ్మర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బాలయ్య, మండల వైస్ ఎంపీపీ సునీతానాయక్, శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ గౌడ్, డైరెక్టర్ కె.చంద్రయ్య, ఎంపీటీసీ చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు నాయక్, మండల అధ్యక్షుడు రాజు, సంఘం నాయకులు పాల్గొన్నారు.



కందుకూరు: విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి, జెడ్పీచైర్మన్, సంఘం నాయకులు



మహేశ్వరం: మొల్లమాంబ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆనంద్

## క్రీడాకారుల ప్రతిభ

కడ్తాల్: జిల్లాస్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో కడ్తాల్ జోన్‌కు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు జోనల్ క్రీడా కార్యదర్శి భీముడు తెలిపారు. శనివారం శేరిలింగంపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో, కడ్తాల్ జోన్ పరిధిలోని (ఆమనగల్లు, మాడ్గుల్, తలకొండపల్లి, కడ్తాల్) మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా, బాలుర అండర్–14 విభాగంలో కడ్తాల్ జోన్ కబడ్డీ జట్టు రెండవ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఏడుగురు బాలురు, ముగ్గురు బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. గెలుపొందిన జట్టుకు ట్రోఫీతో పాటు, ప్రశంసా పత్రాలు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏంఈవో సర్దార్‌నాయక్, నోడల్ అధికారి జంగయ్య, పీడీలు చంద్రమోహన్, రఘుమారెడ్డి, జ్యోతి, పీఈటీలు రాజు, సుశీల, రామకృష్ణరెడ్డి, ప్రసాద్, ఆనంద్‌బాబు, పరమేశ్ పాల్గొన్నారు.

# దళితుల అభివృద్ధికే 'దళితబంధు'

**బీఆర్ఎస్ నాయకుడు పరమేశ్**



కడ్తాల్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్

కడ్తాల్: దళితుల సమగ్ర అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సామాజిక వివక్ష, అణిచివేతకు గురవుతున్న దళితుల సమగ్ర అభివృద్ధి కోసం, సీఎం ఆహర్నిషలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో ఏ ఒక్క రాజకీయ పార్టీగాని, ఏ ముఖ్యమంత్రిగాని దళితుల అభివృద్ధికి కృషి చేయలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన సమయంలో దళితుల స్థితి గతులను, కష్టాలను తెలుసుకున్నారని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత వారి అభ్యున్నతి కోసం దళితబంధు పథకం తీసుకువచ్చారని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గానికి రూ.120 కోట్ల విలువ గల 1,200 దళితబంధు యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ యాదయ్య, ఎంపీటీసీ ప్రియ, ముత్తికృష్ణ, కుమార్, దేవుల, గిరి నాయకులు ఉన్నారు.

# వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పర్యటన

ఇబ్రహీంపట్నం: మంచాల మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం శనివారం పర్యటించింది. వరి, పత్తి పంటలకు సోకిన తెగుళ్లను పరిశీలించారు. ఈనె దశలో ఉన్న వరి పంటకు కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉందని, అక్కడక్కడ తామర పురుగు బెడద కూడా కనిపిస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఒక లీటర్ నీటికి 2 గ్రాముల కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్‌ను కలిపి వరి పంటపై పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. పత్తిలో రసం పీల్చు పురుగుల బెడద ఈ సమయంలో ఎక్కువగా ఉంటుందని ఇమిడాక్లోప్రిడ్ 0.6 మి.లీటర్‌ను ఒక లీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు శాస్త్రవేత్తలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, ఏఓ జ్యోతిశ్రీ, శాస్త్రవేత్తలు ఎల్ కృష్ణ, కిరణ్‌బాబు, వాణిశ్రీ, కోఆర్డీనేటర్ లక్ష్మణ్, ఏఈఓలు పాల్గొన్నారు.

# గణేశ్ లడ్డూల చోరీకి యత్నించిన ఇద్దరి అరెస్టు

హస్తినాపురం: గణేశ్ మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా ఉత్సవ కమిటీ వారు రాత్రి సమయంలో తప్పనిసరిగా ఇద్దరు వ్యక్తులను కాపలా ఉంచాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేవ జలేంధర్‌రెడ్డి సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల్లోని వినాయకుడి లడ్డూలను శనివారం తెల్లవారుజామున దొంగతనం చేసేందుకు యత్నించిన ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. మన్సూరాబాద్ రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన గుడ్డేటి అజయ్ (19), బొడ్డుపల్లి మహేశ్ (19)లు శనివారం తెల్లవారు జామున 2 గంటలకు మన్సూరాబాద్ ప్రాంతంలోని గణేశ్ మండపాల్లోని లడ్డూను చోరీ చేసేందుకు రాగా కావేరి పృథ్వీరాజ్ అనే వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ జలేంధర్‌రెడ్డి

## గణపతి బప్పా మోరియా

మహేశ్వరం/మీర్‌పేట: నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథులు ప్రత్యేక పూజలం దుకుంటున్నారు. అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పలంకరణతో పాటు భక్తులు నిత్య పూజలు చేస్తున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజలందరిని గణనాథుడు ఆయురారోగ్యాలతో చల్లగా చూడాలని, సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు పండేలా కరుణ చూపాలని వేడుకున్నారు.



బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న బీఆర్ఎస్ యువ నాయకులు పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి



నాగిరెడ్డిపల్లి తండాల్లో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



మీర్‌పేట: జిల్లెలగూడ మల్‌రెడ్డి రంగారెడ్డి కాలనీలో ..



మహేశ్వరం: అన్నదానం నిర్వహిస్తున్న దేవులానాయక్ తదితరులు

## క్లుప్తంగా

### నేడు మంత్రి సబితారెడ్డి రాక

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు ఆదివారం మంత్రి సబితారెడ్డి రానున్నారు. మామిడిపల్లి లోని 11,12 డివిజన్లు, కుర్మల్‌గూడ, బాలాజీనగర్, ఇందిరానగర్, అలాగే బాలాపూర్‌లోని పెద్ద చెరువు సుందరీకరణ పనులు ప్రారంభోత్సవం ఉంటుందని అధికారులు తెలిపారు. 27 పనులకు రూ.59.2 కోట్లను హెచ్ఎండీఏ, సాధారణ నిధులు కేటాయించినట్లు వెల్లడించారు.

### లార్డ్స్‌లో రెయిన్‌బో డే



రెయిన్‌బో డేను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని లార్డ్స్ ఓలంపియాడ్ స్కూల్లో శనివారం రెయిన్‌బో డేను నిర్వహించారు. చిన్నారులు రంగుల దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొని సప్తవర్ణాల రెయిన్‌బో డేను నిర్వహించారు. ఇంద్ర ధనస్సులోని రంగుల గురించి వివరించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీన్ సతీష్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సంక్షేమంతో సంతోషం

**కౌన్సిలర్ మల్లేశ్**



బ్రాహ్మణపల్లి చెరువులో చేప పిల్లలను వదులుతున్న కౌన్సిలర్

తుర్కయంజాల్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని పురపాలక సంఘం పరిధిలోని బ్రాహ్మణపల్లి కౌన్సిలర్ మల్లేశ్ అన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం బ్రాహ్మణపల్లిలోని చెరువులో స్థానిక మత్స్యకారులతో కలిసి చేప పిల్లలను చెరువులో వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న చేపపిల్లల పంపిణీతో మత్స్య సంపద పెరుగుతుందన్నారు. ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల్లో కష్టాలు తీరాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

### 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగస్వాములు కండి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్

తుర్కయంజాల్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వామ్యులు కావాలని మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్ కోరారు. శనివారం పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇళ్లలో చెత్తను ఆరు బయట వేయకుండా, చెత్తను సేకరించే ఆటోలకు అందజేయాలని సూచించారు. తల్లిదండ్రులకు కూడా స్వచ్ఛతపై అవగాహన కలిపించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛత హి సేవా ప్రతిజ్ఞను చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించి, ఆ తర్వాత స్థానిక సాయి ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి తెలిపారు. కార్యక్రమానికి పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, అభిమానులు తప్పక హాజరుకావాలని కోరారు.

### ప్రశాంతంగా 'మిలాద్ ఉన్ నబి'

ఆమనగల్లు: మిలాద్ ఉన్ నబి పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో శనివారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిలాద్‌ఉన్ నబి ర్యాలీని ఈ నెల 28న కాకుండా అక్టోబర్ 1 న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, ర్యాలీ సందర్భంగా ఎదురయ్యే సమస్యలను వారు పోలీసులకు వివరించారు. అనంతరం సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు నిర్వహించే ర్యాలీకి ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. ర్యాలీ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తామని సీఐ తెలిపారు. ఎస్ఐ బాల్‌రాం, వివిధ మసీదు కమిటీ అధ్యక్షుడు మాసూం, గౌస్, ఖాదర్‌ఖాద్రి, మాజీ అధ్యక్షుడు సయ్యద్ ఖలీల్, పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.